# ప్రజల విశ్వాసమే మా బలం : ఎమ్మెల్యే రేవూరి







జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## వరంగల్

ములుగు - మహబూబాబాద్
జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ

మంగళవారం | 17 | ఫిబ్రవరి | 2026 ♦ పేజీలు : 7




# వెన్నుపోటు రాజకీయాలు సహించబోము

## పంచాయతీ రాజ్,స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క

- మున్సిపల్ చైర్మన్ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క

**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** ములుగు మున్సిపాలిటీ నూతన చైర్ పర్సన్ గా ఎన్నికైన చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి సన్మాన కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొని కాంగ్రెస్ కౌన్సిలర్లను అభినందించారు. కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన కౌన్సిలర్లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రతి కార్యకర్తకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి చైర్ పర్సన్ గా చింతనిప్పుల చంద్రకళ బిక్షపతిని ఎన్నుకున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ చైర్ పర్సన్ కావాలనే

మిగతా 2 లో...



# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టండి

- నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్ చాహాత్ బాజ్పాయి తో కలిసి వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ సందర్శన
- వడ్డేపల్లి జంక్షన్ విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం

**వరంగల్ సిటీ, ఫిబ్రవరి 16(ప్రజా జ్యోతి):** రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగర ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి హనుమకొండ పరిధిలోని వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ ను మేయర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి శుద్ధి ప్రక్రియను మరింత

మిగతా 2 లో...

# కోటగుళ్ళు అభివృద్ధిలో పాలుపంచుకుంటాం

- ♦ శివరాత్రి వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది
- ♦ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్




**గణపురం, ఫిబ్రవరి16, ప్రజాజ్యోతి:** ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ అభివృద్ధిలో పాలుపంచుకుంటామని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి ఆయన కోటగుళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆయనకు ఘన స్వాగతం పలికింది. మొదట శివ కళ్యాణ మహోత్సవంలో ఎస్పీ పాల్గొన్నారు. అనంతరం గణపేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాగరణ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక

మిగతా 2 లో...

## ధర్మసాగర్ గ్రామంలో..

# నీటి కోసం ప్రజల గోస

- లక్షలు ఖర్చు చేసినా ఆగని పైప్ లైన్ లీకేజీలు
- ♦ వేసవి ముందే శాశ్వత పరిష్కారం కోరుతున్న గ్రామస్తులు

**ధర్మసాగర్, ఫిబ్రవరి16 (ప్రజా జ్యోతి):** హనుమకొండ జిల్లాలోని ధర్మసాగర్ మండల కేంద్రంలో తాగునీటి సమస్య మళ్లీ తలెత్తింది. గతంలో గ్రామంలో తాగునీటి పైప్ లైన్ ల మరమ్మతుల కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ, లీకేజీలు మాత్రం పూర్తిగా ఆగడం లేదు. దీంతో గ్రామస్తులు

మిగతా 2 లో...



## ధర్మసాగర్ గ్రామంలో నీటి కోసం ప్రజల గోస

(మొదటి పేజీ తరువాయి...)

తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని పలు కాలనీల్లో పైప్ లైన్ లు తరచుగా పగిలిపోవడం, లీకేజీల వల్ల నీరు వృథాగా పారిపోవడం జరుగుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో సరైన ఒత్తిడితో నీరు రాకపోవడంతో కుటుంబాలు నీటి కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. గతంలో అధికారులు పైప్ లైన్ మరమ్మతుల పేరుతో భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ, శాశ్వత పరిష్కారం కనబడకపోవడంపై గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. పనుల్లో నాణ్యత లేకపోవడం వల్లే తరచుగా సమస్యలు వస్తున్నాయని ఆరోపిస్తున్నారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో నీటి అవసరం మరింత పెరగనుంది. ఈ పరిస్థితుల్లో వెంటనే పూర్తిస్థాయి తనిఖీలు చేపట్టి, దెబ్బతిన్న పైప్ లైన్ లను పూర్తిగా మార్చాలని, భవిష్యత్తులో లీకేజీలు రాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకుని గ్రామంలో నీటి సరఫరాను సమర్థంగా నిర్వహించాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి...)

సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని మేయర్ స్పష్టం చేశారు. నీటి శుద్ధి కోసం అవసరమైన రసాయనాలను సమృద్ధిగా నిల్వ ఉంచుకోవడంతో పాటు, పైప్ లైన్లలో లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. నగరానికి ధర్మసాగర్ నుండి నీటి సరఫరా జరుగుతున్నందున అక్కడి నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నీటి లభ్యతపై స్పష్టమైన అవగాహనతో చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అంతకుముందు వడ్డేపల్లి ప్రాంతంలోని జంక్షన్ ను మేయర్, కమిషనర్ లు పరిశీలించారు. రహదారి రద్దీ సమస్యలను దృష్టిలో ఉంచుకుని జంక్షన్ విస్తరణకు సంబంధించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎస్ ఈ శ్రీనివాస్ రావు, ఈఈలు రవికుమార్, మాధవి లత, డీఈలు రాజ్ కుమార్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కోటగుళ్ళు అభివృద్ధిలో పాలుపంచుకుంటాం ...





(మొదటి పేజీ తరువాయి...)

కార్యక్రమ వేదికపైకి ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని ఈ వేడుకలకు ఇంతమంది జనం వస్తారని ఊహించలేదని అన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా పోలీసుల పక్షాన ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న బృందాలను అభినందించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆయనకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో గణపురం సిఐ కరుణాకర్ రావు ఎస్ఐ రేఖ అశోక్ రెండవ ఎస్ఐ గైకవాడ అమూల్య, గోరి కొత్తపల్లి ఎస్ఐ దివ్య తదితరులు పాల్గొన్నారు.

# వెన్నుపోటు రాజకీయాలు సహించబోము

(మొదటి పేజీ తరువాయి...)



ఆశ ఉంటుందని, కానీ అవకాశం ఒక్కరికి మాత్రమే దక్కుతుందని స్పష్టం చేశారు. సీనియర్ నాయకుడిగా ములుగు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్న బిక్షపతికి అనుభవం దృష్ట్యా ఈ అవకాశం కల్పించామని మంత్రి పేర్కొన్నారు. గతంలో ఎన్నో ఒత్తిడులు వచ్చినా పార్టీ మారకుండా నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. పార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మున్సిపాలిటీ సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడు బిక్షపతి అని అన్నారు. అవకాశం రాని వారు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని, భవిష్యత్తులో మంచి అవకాశాలు అందరికీ వస్తాయని మంత్రి భరోసా ఇచ్చారు. తనకు ఎవరూ ఎక్కువ కాదు, తక్కువ కాదు అందరూ సమానమని స్పష్టం చేశారు. ములుగు మున్సిపాలిటీలో నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోవడానికి వెన్నుపోటు రాజకీయాలే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత పార్టీలో ఉండి మోసం చేయడం క్షమించరాని నేరమని, అలాంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. ఎవరు వెన్నుపోటు రాజకీయాలు చేశారో తమకు తెలుసని, పద్ధతి మార్చుకోవాలని ఇది చివరి హెచ్చరిక అని అన్నారు. ములుగు జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లెల కుమార్ అన్నలాంటివారని పేర్కొంటూ ఆయన కుమారుడు నల్లెల భరత్ కు ఇంకా మంచి భవిష్యత్తు ఉందని, రాబోయే రోజుల్లో అవకాశాలు వస్తాయని తెలిపారు. తమను ఓడించేందుకు రియల్ ఎస్టేట్ వర్గాలు భారీగా డబ్బు ఖర్చు చేసినప్పటికీ ప్రజలు కాంగ్రెస్ కే పట్టం కట్టారని మంత్రి సీతక్క అన్నారు. అన్ని ఎన్నికల్లో కార్యకర్తలు సమిష్టిగా పనిచేస్తే విజయం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ కాంగ్రెస్ కైవసం

- చైర్మన్ గా పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ గా నేతావత్ శిభారాణి ఎన్నిక.
- మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ భారీ విజయోత్సవ ర్యాలీ.
- చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లను శాలువాతో సత్కరించిన ఎమ్మెల్యే నాగరాజు
- వర్ధన్నపేట మున్సిపాలిటీ కైవసం చేసుకునే విధంగా కృషి చేసిన పార్టీ శ్రేణులు అందరికీ కృతజ్ఞతలు అభినందనలు తెలియజేసిన ఎమ్మెల్యే నాగరాజు



**వర్ధన్నపేట ఫిబ్రవరి 16, ప్రజా జ్యోతి:** వర్ధన్నపేట మున్సిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్న నేపథ్యంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే నాగరాజు ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించబడింది. వర్ధన్నపేట మున్సిపాలిటీ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ అంతటా కాంగ్రెస్ పార్టీ జెండాలు ఎగురవేస్తూ, నినాదాలతో పట్టణం మార్మోగింది. ప్రజల ఆశీస్సులతో మున్సిపాలిటీ పీఠాన్ని గెలుచుకున్నామని, ఇది పార్టీ శ్రేణుల కృషి, కార్యకర్తల త్యాగాల ఫలితమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు అభివృద్ధికి అనుకూలమని, వర్ధన్నపేట పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ చేపడతామని తెలిపారు.. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. 6 వార్డులో ఘన విజయం సాధించి ప్రమాణ స్వీకారం చేపట్టిన కౌన్సిలర్ శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ, వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పార్టీ శ్రేణులకు, నాయకులకు, కార్యకర్తలకు, పట్టణ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా నిలిచిన ప్రతి ఓటరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా ఎన్నికైన పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన నేతావాత్ శిభారాణిలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. పట్టణ అభివృద్ధికి సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు. కొంతమంది వ్యక్తులు వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడి అసత్య ప్రచారాలు నిర్వహించినా ప్రజలు వాటిని తిరస్కరించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని ఆయన పేర్కొన్నారు. అధికార దుర్వినియోగం చేశామనే ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, తాము ఎప్పుడూ రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్య పద్ధతిలోనే పనిచేస్తామని స్పష్టం చేశారు. పేద, బలహీన వర్గాల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శక పాలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. వర్ధన్నపేట కాంగ్రెస్ గెలుపులో కీలక పాత్ర పోషించిన హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆయూబ్లకు, అలాగే మండలాధ్యక్షులు, పట్టణ నాయకులు, యువజన, మహిళా విభాగాల ప్రతినిధులకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. వర్ధన్నపేట పట్టణ ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అహర్నిశలు శ్రమించి వర్ధన్నపేటను రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ పారదర్శక, ప్రజాకేంద్రిత పాలన అందిస్తామని హామీ ఇచ్చారు.





# గౌరీ పశుపతినాథ్ స్వామివార్ల కళ్యాణం కమనీయం

- లింగోద్భవకాల విశేషాలు మహాదాశీవచనం
- ఆలయ అర్చకులు సదా నిరంజన్ సిద్ధాంతి





**ఎల్కతుర్తి ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి)** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని శ్రీ పశుపతినాథ్ దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించబడ్డాయి. ఆలయం పుష్పాలంకరణతో కళకళలాడుతూ భక్తులతో నిండిపోయింది. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమై రోజు పొడుగునా నిరంతరంగా కొనసాగాయి. సాయంత్రం 7:10 గంటలకు శ్రీ గౌరీ పశుపతినాథ్ స్వామి వారి దివ్య కళ్యాణం మహోత్సవం (శివ పార్వతి కళ్యాణం) వైభవంగా జరిగింది. వేద మంత్రోచరణల మధ్య అర్చకులు సాంప్రదాయ బద్ధంగా కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులు ఇచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు సమీప గ్రామాల నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు సదా నిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ, మహాశివరాత్రి రోజున కళ్యాణోత్సవం నిర్వహించడం ప్రత్యేకత అని తెలిపారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదం పంపిణీ చేశారు. తదుపరి రాత్రి 12: గంటలకు లింగోద్భావకాల సమయాన విశేష పంచామృత సహిత రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించబడింది. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదారలతో అభిషేకం చేసి భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. రాత్రివేళ ఆలయమంతా శివనామస్మరణంతో మార్మోగింది. అనంతరం భక్తులందరికీ వేదాశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సదా నిరంజన్ సిద్ధాంతి, శివకుమార్, గొంగల్ల మఠం నాగభూషణం, గొంగల్ల మఠం, ఆలయ కమిటీ చైర్మన్ గంజి భవన ఋషి, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనేక మంది భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని భక్తులు తమ మొక్కులు చెల్లించుకొని స్వామివారి ఆశీస్సులుపొందారు. మొత్తంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు భక్తి పారవశ్యంతో ఆధ్యాత్మిక ఉత్సాహంతో విజయవంతంగా ముగిశాయి. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొని శివ భక్తుల హృదయాలలో అపూర్వ ఆనందాన్ని నింపాయి.

## శివాలయంలో మహా అన్నదాన కార్యక్రమం



**ఎల్కతుర్తి ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి ):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని శివరాత్రి పర్వదినం అనంతరం శివాలయం ఆవరణంలో భక్తుల కొరకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహా అన్నదాన దాతలు గోలి వివేక్, అల్లి శ్రీహరి, దుద్దుల శ్రీధర్, లోకిని సూరయ్య, వారి సహాయ సహకారాలతో మహా అన్నదానాన్ని శివాలయ ఆవరణంలో భక్తుల కొరకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదానం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులు అన్నదాన దాతలకు అభివందనాలు తెలియజేశారు. అన్నదాత సుఖీభవ అని ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు.

## ఇండియా పాకిస్తాన్ మ్యాచ్ కోసం ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు



**దామెర, ఫిబ్రవరి 16 (ప్రజాజ్యోతి):** హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలో ఇండియా పాకిస్తాన్ మ్యాచ్ వీక్షించడానికి ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని నాయకులు స్వచ్చందంగా ముందుకు వచ్చి యువత లో క్రీడా స్ఫూర్తి పెంచేందుకు, దేశం పట్ల భక్తి భావం పెంపొందించేందుకు ఒక్క చోట మ్యాచ్ చూసేందుకు ఏర్పాట్లు చేశారు. క్రీడా ప్రాంగణంలో ఇండియా పాకిస్తాన్ మ్యాచ్ వీక్షించడానికి బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మెరుగు సంతోష్, ఇమ్మడి కుమార్, పెంట రాజు, రావుల కార్తీక్, సోనబోయిన కిరణ్, కాంగ్రెస్ 6వ వార్డ్ మెంబర్ ఇమ్మడి రజనీకర్, దామెర ఆనందం, ఏం శ్రీను, నాగరాజు, వినోద్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రుద్ర కోటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

- గ్రామ సర్పంచ్ సహేంద్ర బిక్షపతి



**రాయపర్తి ఫిబ్రవరి 16 ప్రజా జ్యోతి:** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాయపర్తి సర్పంచ్ గారె సహేంద్ర బిక్షపతి హాజరై స్వామి వారికి, పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అధికారులు, అర్చకులు మత్త గజంపం చాక్షరి, ఆరుట్ల రామకృష్ణమాచార్యులు సంప్రదాయబద్ధంగా సర్పంచ్ కి స్వాగతం పలికి ఆశీర్వాదాలు అందజేశారు. అనంతరం స్వామివారి దివ్య కల్యాణాన్ని దర్శించుకున్న వారు రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. మహాశివరాత్రి పర్వదినం ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టత కలిగినదని పేర్కొన్న సర్పంచ్ గారె సహేంద్ర బిక్షపతి గారు, ఇటువంటి ధార్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో , భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ జడ్పీటీసీ నామా కరంచంద్ గాంధీ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా



**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 16 ప్రజా జ్యోతి :** వ్యక్తిగత కారణాలతో కాంగ్రెస్ పార్టీకి, క్రియాశీల సభ్యత్వానికి మాజీ జడ్పీటీసీ నామ కరం చందు గాంధీ సోమవారం రాజీనామా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాటడుతూ గత 7సం,,లుగా నన్ను ఆదరించిన మంత్రి సీతక్క కి, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ కి, జిల్లా,మండల నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు,ధన్యవాదాలు తెలిపారు. అలాగే నేను ఏ పార్టీలోకి వెళ్ళే ఉద్దేశం లేదు అని ప్రకటించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన జీకే ఫౌండేషన్

- గారే వెంకటేష్ మాదిగ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక చైర్మన్



**రాయపర్తి, ఫిబ్రవరి 16 ప్రజా జ్యోతి:** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన ఐత కుమార్ తల్లి ఐత లక్ష్మీ ఇటివల అనారోగ్యంతో మరణించగా సోమవారం బాధిత కుటుంబాన్ని జి కె ఫౌండేషన్ చైర్మెన్, తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక గారే వెంకటేష్ మాదిగ పరామర్శించి 5,000 రూపాయలు ఆర్ధిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీకే ఫౌండేషన్ డైరెక్టర్ గారే సందీప్,వార్డు మెంబర్ గారే యాకుబ్,గారే శ్రీనివాస్,ఐత సంపత్,తదితరులు పాల్గొన్నారు.

## రాయపర్తి గ్రామాన్ని పారిశుధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దుతా

- గ్రామ సర్పంచ్ గారేసహేంద్ర బిక్షపతి



**రాయపర్తి, ఫిబ్రవరి 16, ప్రజా జ్యోతి:** వరంగల్ జిల్లాలోని రాయపర్తి మండల కేంద్రాన్ని పారిశుద్ధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దుతానని గ్రామ సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి అన్నారు. సోమవారం రాయపర్తి గ్రామంలో మురికి కాలువలు చెత్తతో నిండి దుర్వాసన కోడుతుండగా పరిశీలించిన గ్రామ సర్పంచ్ వెంటనే పారిశుధ్య కార్మికులను పిలిపించి వీధులను శుభ్రం చేయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారూ. మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ముఖ్యవసర ఏదైనా పారిశుధ్యం త్రాగునీరు కరెంటు వీది దీపాలు, రోడ్లు పూర్తి చేయిస్తానని ,ఎక్కడ ఎలాంటి సమస్య కూడా తలెత్తకుండా గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ వినోద్, కారోబార్ మల్లయ్య, ఎలక్ట్రీషియన్, వాటర్ మెన్ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## జేఎన్ఎస్ లో ఈ నెల 20 నుండి 23వరకు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్

- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి



**హనుమకొండ ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి):** సీఎం కప్ రెండో ఎడిషన్ రాష్ట్రస్థాయి పోటీలలో భాగంగా అథ్లెటిక్స్ కు సంబంధించిన పోటీలు హనుమకొండ జిల్లాలో ఈ నెల 20 నుండి 23 వ తేదీ వరకు జరగనున్నాయని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ హనుమకొండ జేఎన్ఎస్ లో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి దాదాపుగా పదిహేను వందల మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. క్రీడాకారులకు ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా యువజన క్రీడల అధికారి అశోక్ కుమార్, డీఈవో గిరి రాజ్ గౌడ్, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, డిఏఈఓ గోపాల్, డిఎం హెచ్వో డాక్టర్ అప్పయ్య, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజలో పాల్గొన్న నాయకులు



**వర్ధన్నపేట ఫిబ్రవరి 16, ప్రజా జ్యోతి:**వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం, కట్రియాల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు సుల్తాన్ ఎల్లమ్మ, నాంపల్లి దేవేందర్‌ల ఇందిరమ్మ ఇండ్ల వద్ద భూమి పూజ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బందారి సతీష్ గౌడ్, మైనార్టీ మండల అధ్యక్షుడు ఎం.డి. అక్బర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ నరుకుడు వెంకటయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతలో ప్రతి బూత్‌కు 12 ఇండ్ల చొప్పున నియోజకవర్గంలో సుమారు 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అయితే కొంతమంది లబ్ధిదారులకు స్థలం లేదా ఆర్థిక సామర్థ్యం లేక ఇండ్లు నిర్మించుకోలేని పరిస్థితి ఉందని చెప్పారు. అలాంటి లబ్ధిదారులకు కూడా ఇండ్లు నిర్మించేందుకు ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఒక ప్రముఖ సంస్థతో చర్చించి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు తాటికాయల్ కుమారస్వామి, గ్రామ 7వ వార్డు సభ్యుడు ఎలికట్టె చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ ఐలాపురం వెంకయ్యకు నివాళులు అర్పించిన కుమ్మర సంఘం నాయకులు



**వరంగల్ సిటీ, ఫిబ్రవరి 16(ప్రజాజ్యోతి ):**విజయవాడకు చెందిన ప్రముఖ బీసీ ఉద్యమ నాయకుడు, శాలివాహన సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య ఆదివారం తుది శ్వాస విడిచారు. ఆయన వయస్సు 93 సంవత్సరాలు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తన ఇంట్లోనే కన్నుమూశారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ, సామాజిక, వ్యాపార వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. నిరుపేద కుమ్మరి సామాజిక కుటుంబంలో పుట్టిన ఐలాపురం వెంకయ్య కష్టపడి ఎదిగారు. విజయవాడలోని ప్రముఖ ఐలాపురం హోటల్ ను స్థాపించి ఇప్పటివరకూ నడుపుతున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేశారు. కృష్ణా జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి శాసన మండలి సభ్యునిగా ఎన్నికై 8 ఏళ్ల పాటు పనిచేశారు. బీసీల అభ్యున్నతి కోసం తీవ్రంగా పాటుపడ్డారు. అలాగే బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషిచేశారు. శాలివాహన (కుమ్మర) సంఘం అధ్యక్షుడిగా కూడా దశాబ్దాల పాటు సేవలందించారు. సోమవారం ఉమ్మడి వరంగల్ మరియు రాష్ట్ర కుమ్మర సంఘం నాయకులు స్వర్గీయ ఐలాపురం వెంకయ్య మృతదేహాన్ని సందర్శించి ఘన నివాళులు అర్పించారు. కుమ్మర కులానికి వారు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. నివాళులు అర్పించిన వారిలో కుమ్మర సంఘం రాష్ట్ర నాయకులు ఓదెల చందర్ రావు, వరంగల్ జిల్లా అధ్యక్షులు ఆవునూరి రామన్న, జిల్లా సీనియర్ నాయకులు ఆవునూరి ఆనందం, కలువల వీరస్వామి, ఆవునూరి బిక్షపతి, యూత్ ప్రెసిడెంట్ ఆకారపు భరత్ తదితరులు ఉన్నారు.

# కమ్యూనిస్టు కంచుకోటలో వికసించిన కమలం

- **డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**





**నర్సంపేట ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి )** నర్సంపేట మున్సిపాలిటీలో 28వ వార్డు నుండి మొదటిసారిగా బిజెపి జెండా ఎగరవేసిన జూలూరు రోజా రాణి బిజెపి ఎక్కడుంది ఎక్కడుంది అనే వాళ్లకి సరైన సమాధానం తో నర్సంపేట గడ్డ పైన మొదటిసారిగా కమలం వికసించింది.నర్సంపేట కమ్యూనిస్టు కంచుకోట ఆ గడ్డ పై మొట్టమొదటిసారిగా భారతీయ జనతా పార్టీ కాషా జెండా ఎగర వేసిందని డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు ఏదైనా ఒకటి సంఖ్య తోటే ప్రారంభ అవుతుందని అన్నారు ఈరోజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో అవినీతి లేని పాలన అందించడమే బిజెపి లక్ష్యమని అన్నారు బిజెపి ఆ ప్రజల కోసం ప్రజల వెంబడే ఉండే పార్టీ అని ప్రజలకు ఏమైనా అన్యాయం జరిగితే పోరాడేది ఒక బిజెపి అని అన్నారు. అనంతరం 28వ వార్డు నుంచి గెలుపొందిన జూలూరు రోజా రాణి ని వారి తనయుడు జూలూరు మనిష్ గౌడ్ ని శా లువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు 28వ వార్డులో ఉన్న సమస్యలన్నిటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని వార్డు ప్రజల మధ్యనే ఉండాలని వార్డు ప్రజల శ్రేయస్సు కోసమే పనిచేయాలని అన్నారు.ఈ కార్యక్రమం లో బీజేపీ పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్,సీనియర్ నాయకులు కట్ల రామచందర్ రెడ్డి, గడ్డం ఆంజనేయులు,పొదిల రామచందర్,ఆబోతు రాజు యాదవ్,గంగిడి మహేందర్ రెడ్డి, పంజాల శ్రీరామ్, మండల అధ్యక్షులు తనువుల అంబేద్కర్,నాయిని అశోక్, మహిళా నాయకురాలు సూత్రపు సరిత సామల రేణుక, తాళ్లూరి వసంత, పట్టణ బిజెపి నాయకులు ఠాకూర్ విజయ్ సింగ్, కాసుల నాగేంద్రబాబు,వల్లాజీ నరేందర్, ముత్యాల శీను, అచ్చ దయాకర్, బానోత్ రాజేందర్,బానోతు రమేష్, ఎర్రా రాజు,కుంకీస విగ్నేష్‌గౌడ్, చిలువేరు అన్వేష్,కుసుమ భవాని శంకర్, సామల ప్రవీణ్ కుమార్, ఠాకూర్ శివంజన్ సింగ్,మైసి శోబన్,జూలూరి రాజేష్,పల్లకొండ శ్రీనివాస్,సందీప్ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి లక్ష్యంగా సమిష్టిగా కృషి చేద్దాం

- **సర్పంచ్ బొల్లం ఉమారాణి రాజీవ్**



**రఘునాథపల్లి, ఫిబ్రవరి 16 ( ప్రజాజ్యోతి ):** రఘునాథపల్లి గ్రామ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని సర్పంచ్ బొల్లం ఉమారాణి రాజీవ్ అన్నారు. సోమవారం కమ్యునిటీహాల్ వద్ద పర్పంచ్ అధ్యక్షతన మొదటి గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ ఉమారాణి రాజీవ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ సమిష్టి కృషితో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. గ్రామ అవసరాలను. ప్రజా సంక్షేమాలను గ్రామసభలో చర్చించారు. త్వరలోనే గ్రామంలో అన్ని -పనులను పూర్తి చేయనున్నట్లు వారు తెలిపారు. గ్రామ అభివృద్ధి దేయంగా ప్రతి ఒక్కరు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ద్యావర యాకయ్య, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రజాసేన వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మకంటి రమేష్ వర్మ




**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి ):**ములుగు జిల్లా కేంద్రంలోని డివిల్ ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో తెలంగాణా రాష్ట్ర ప్రజసేన వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మకంటి రమేష్ వర్మ కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి,స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ(సీతక్క) పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా రమేష్‌వర్మ మాట్లాడుతూ..గత పది సంవత్సరాలుగా జరగని అభివృద్ధి,కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జరుగుతుందని,ములుగు జిల్లా అభివృద్ధి పథంలో నడుస్తుందని, అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరామని రమేష్ వర్మ అన్నారు.తనకు సహకరించిన గొల్లపల్లి రాజేందర్ గౌడ్,వినయ్, వేల్పూరి సత్యం,బొచ్చు సమ్మయ్యలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం తహసీల్దార్ అబిద్ అలీ

- **చెన్నారావుపేటలో బాల్య వివాహాల నిర్మూలన ప్రచార రథం ప్రారంభం**
- **చిన్నారి పెళ్లిళ్లు చిదిమేయకండి.. చట్టం పంజా విసురుతుంది తాసిల్దార్ అబిద్ అలీ**
- **వయసు మార్చిన తేదీలతో పెళ్లిళ్లు చేస్తే కఠిన చర్యలు తప్పవు అధికారుల హెచ్చరిక**

**చెన్నారావుపేట ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి ) :**బాల్య వివాహాలు సామాజిక రుగ్మతని, వీటిని అరికట్టడం అందరి బాధ్యతని చెన్నారావుపేట తహసీల్దార్ అబిద్ అలీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, షేర్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల్య వివాహాల నిర్మూలన అవగాహన ప్రచార రథాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ అయోషా పర్వీన్, పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల శారీరక పక్వత లేని చిన్నవయసులోనే గర్భం దాల్చడం వల్ల మాతృ మరణాలతో పాటు శిశు మరణాలు సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.బాలికల పుట్టిన తేదీలను మార్చి అక్రమంగా వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు తమ పరిధిలో బాల్య వివాహాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఎక్కడైనా బాల్య వివాహ ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రచార రథం ద్వారా మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ రషీద్ షేర్ ఎన్జీఓ జిల్లా కో-ఆర్డినేటర్ టి. శిరీష, జమున, జ్ఞానేశ్వరి, జగన్, చామంతి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.





# ప్రజల విశ్వాసమే... మా బలం

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**పరకాల, ఫిబ్రవరి 16, (ప్రజా జ్యోతి):** పరకాల పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన విశ్వాసమే తమ బలమని, ఆ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సుపరిపాలన అందించడం తమ లక్ష్యమని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన సందర్భంగా సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కుంకుమేశ్వర ఆలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, పరకాల బస్టాండ్, పోచమ్మ తల్లి గుడి మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. మున్సిపల్ నూతన కార్యవర్గ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన కార్యకర్తలు, పరిశీలకులు, ముఖ్యంగా పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పరకాల ప్రజలు విశ్వాసంతో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించారని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు పట్టణ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చిన ఆయన, నీతి–నిజాయితీతో అవినీతి రహిత పాలన అందిస్తూ పరకాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పట్టణం వెనుకబడిందని విమర్శిస్తూ 2027 డిసెంబర్ నాటికి డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పరిశుభ్రమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా పరకాల పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని, మరో 30 సంవత్సరాలు పరకాలలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. పరకాల నియోజకవర్గంలో ఎవరైనా రౌడీయిజం, గుండాయిజం చేస్తే కఠినంగా అణచివేస్తామని హెచ్చరించారు. ప్రజలు కోరుకునేది ప్రశాంత వాతావరణం, అభివృద్ధి అని పేర్కొంటూ ప్రజల సహకారంతో పరకాల పట్టణాన్ని ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు.







# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- అవగాహన ప్రచార రథాల ప్రారంభం



**చెన్నారావుపేట ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి):** బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా మహిళా శిశు సంక్షేమ శాఖ జే ఆర్ సి మరియు 'షేర్' స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ప్రచార రథాలను సోమ వారం పలు గ్రామాల్లో ప్రారంభించారు.చెన్నారావుపేట మండలం జల్లి గ్రామంలో ప్రచార రథాన్ని సర్పంచ్ యటా సుధాకర్, ఉప సర్పంచ్ మెరుగు బాబు జెండా ఊపి ప్రారంభించారు.నర్సంపేట మండలం పాత ముగ్ధంపురం లో సర్పంచ్ ననుమాస కరుణాకర్, కార్యదర్శి ఎం.డి. శంషుద్దీన్ జెండా ఊపి రథాన్ని ప్రారంభించారు.బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ఎవ రైనా బాలికల పుట్టిన తేదీలు మార్చి పెళ్లిళ్లు చేస్తే వెంటనే సమాచారం అందిం చాలని అధికారులు కోరారు.నవ యువ సర్పంచులు, గ్రామస్థులు బాధ్యతగా తీసుకుంటేనే ఈ దురాచారాన్ని అరికట్టగలమని వారు పేర్కొన్నారు.ఈ కార్య క్రమాల్లో షేర్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ టి. శిరీష, ప్రతినిధులు ప్రశాంతి, కల్పన, గాయత్రి, ప్రభాకర్ మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# గ్రామ పరిశుభ్రత అందరి బాధ్యత

- జల్లి సర్పంచ్ యాట సుధాకర్



**చెన్నారావుపేట ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి) :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జల్లి గ్రామంలో సర్పంచ్ యాట సుధాకర్ ఆధ్వర్యంలో పరిశుభ్రత–శుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను సేకరించే ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్ లాడుతూ.. గ్రామస్తులు తమ ఇళ్ల వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ వాహనానికి అందించాలని కోరారు. గ్రామంలోని ప్రతి వీధి పరిశుభ్రంగా ఉండాలంటే సఫాయి కార్మికుల కష్టంతో పాటు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. పరిశుభ్రమైన వాతావరణం వల్ల వ్యాధులు దరిచేరవని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చని తెలిపారు. సఫాయి కార్మికులకు గ్రామస్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెరుగు బాబు, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బం ది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాన్ని ఆదుకున్న డాక్టర్ బోడ అనిల్ నాయక్

**నర్సంపేట ఫిబ్రవరి 16 (ప్రజా జ్యోతి):** నర్సంపేట సేవాగుణంతో ప్రజలే నా దేవుళ్ళు అనే నినాదంతో ప్రజల హృదయాలను గెలుచుకుంటున్న యువ నర్సంపేట ముద్దుబిడ్డ మహబూబాబాద్ పార్లమెంటు స్వతంత్ర అభ్యర్థి అనిల్ నాయక్ నర్సంపేట మండలం దాసరపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉండే సీతారాం నాయక్ తండ లో గతవారం నిరుపేద కుటుంబానికి చెందిన పాషా అనే యువ బిడ్డ నర్సంపేట బిడ్డ అనారోగ్య కారణాల రీత్యా పరమాపదించిన విషయం తెలుసుకొని తండ యూత్ ప్రెసిడెంట్ వంశీ సూచనతో చిన్నపి ల్లలతో తీరని దుఃఖంతో ఉన్న పాషా సతీమణ దగ్గరికి వెళ్లి ఒక అన్నగా నేనున్నా అంటూ ధైర్యం చెప్పి ఓదార్చి తన వంతుగా సహాయం చేయడం జరిగింది.ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ బాలునాయక్,నూతన ఉపసర్పంచ్ అజ్మీర వీరన్న యువకులు,మహిళలు,గ్రామ పెద్ద మనుషులు పాల్గొనడం జరిగింది.



# గత ప్రభుత్వంలో దళితులకు మూడు ఎకరాలు భూమి, దళిత బంధు ఇస్తామని మోసం..

- ప్రజా ప్రభుత్వంలో అణగారిన ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు
- ఎన్నిక ఎదైనా కాంగ్రెస్ పార్టీదే విజయం
- సభండ వర్గాల అభివృద్దే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం
- వర్ధన్నపేట మున్సిపల్ చెర్మెన్,వెస్ చెర్మెన్ ఎన్నికే నిదర్శనం
- మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్



**పర్వతగిరి, ఫిబ్రవరి 16 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి మండలం కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ఏ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని దీనికి ఉదాహరణ గ్రామపంచాయతీ ఎన్నికల్లో, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించామని శ్రీనివాస్ నాయక్ తెలిపారు. సభండా వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది అని,అందుకు నిదర్శనం వర్ధన్నపేట మున్సిపాలిటీ చెర్మెన్, వెస్ చెర్మెన్ ఎన్నిక అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా ఇస్తూ, ఆరు గ్యారెంటీలు అమలు చేసే దిశగా మా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గతంలో పాలించిన నాయకులు ఈ ప్రాంత అభివృద్ధి కోసం గానీ, ఈ ప్రాంత పేద ప్రజలను గాని ఏనాడు పట్టించుకోలేదని అన్నారు. కేవలం వారి స్వార్థం కోసం, స్వార్థ రాజకీయాల కోసం తప్ప ఏనాడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తగిన గౌరవం ఇవ్వలేదని తెలిపారు. ఈ ప్రజా ప్రభుత్వంలో అణగారిన ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇల్లు, సన్నబియ్యం, రేషన్ కార్డు, ఇందిరమ్మ చీరలు, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ భరోసా ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు తీసుకున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో, ప్రజానాయకుడు ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు నాయకత్వంలో ఏ ఎన్నికలు వచ్చినా కూడా విజయం సాధించి రాష్ట్ర ముఖ్యమంత్రికి మా శాసన సభ్యుల వారికి కానుకగా అందిస్తామని శ్రీనివాస్ నాయక్ తెలిపారు. గత ప్రభుత్వంలో దళితులకు మూడు ఎకరాలు భూమి, దళిత బంధు ఇస్తామని మోసం చేశారని మా ప్రభుత్వంలో దళారీ వ్యవస్థ లేకుంటనే అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నమణి తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మొరం తరలింపు....

## అధికారుల నిర్లక్ష్యంపై ఆరోపణలు





**పర్వతగిరి, ఫిబ్రవరి 16 (ప్రజాజ్యోతి):** పర్వతగిరి మండలం చింత నెక్కొండ గ్రామంలో అక్రమంగా మొరం తరలిస్తున్న ఘటన కలకలం రేపుతోంది. గ్రామంలోని డంపింగ్ యార్డు ను ఆనుకొని ఉన్న గుట్ట నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా హిటాచి మెషిన్, డంపర్ వాహనాల సహాయంతో అక్రమంగా మొరాన్ని తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ యంత్రాలతో తవ్వకాలు జరుపుతూ వందల టన్నుల మొరాన్ని అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ అక్రమ తవ్వకాల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని, గడ్డ కూలిపోయి డంపింగ్ యార్డ్ మునిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డు సమీపంలో తవ్వకాలు జరగడం వల్ల గ్రామంలో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని పేర్కొంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, సంబంధిత శాఖలు మౌనంగా ఉన్నాయంటూ గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి, యంత్రాలను సీజ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ఈ విషయంపై రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖలు స్పందించి విచారణ చేపట్టి, అక్రమ మొరం తరలింపును నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

# పర్వతగిరి మండలంలో దోమల ఉగ్రరూపం

- 33 గ్రామపంచాయతీల్లో ప్రజల జీవనం అస్తవ్యస్తం
- స్ప్రే చేయండి... వ్యాధుల ముప్పు నుంచి కాపాడండి
- మండల ప్రజల విజ్ఞప్తి





**పర్వతగిరి, ఫిబ్రవరి 16 (ప్రజాజ్యోతి):** పర్వతగిరి మండలం పరిధిలోని 33 గ్రామపంచాయతీల్లో దోమల బెడద తీవ్ర స్థాయికి చేరింది. వర్షాల అనంతరం ఏర్పడిన నిల్వ నీరు, డ్రైనేజీ సమస్యలు, చెరువులు,కాలువల వద్ద శుభ్రత లోపం కారణంగా దోమలు విపరీతంగా పెరిగాయని గ్రామస్తులు వాపోతున్నారు. దోమల కారణంగా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల ముప్పు పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని, రాత్రిళ్లు నిద్ర లేకపోవడంతో పాటు పగటి పనులు కూడా సరిగా సాగడం లేదని తెలిపారు.ఈ నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో తక్షణమే దోమల మందు స్ప్రే చేయాలని, డ్రైనేజీలను శుభ్రం చేయాలని, నిల్వ నీటిని తొలగించే చర్యలు చేపట్టాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో ప్రత్యేక దోమల నివారణ కార్యక్రమం అమలు చేయాలని కోరుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోకపోతే వ్యాధుల ముప్పు మరింత పెరిగే ప్రమాదముందని మండల ప్రజలు మండి పడ్డారు.

# కోటగుళ్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

- ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం
- రామప్ప సరసన కోట గుళ్ళకు స్థానం
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- కోటగుళ్ల 20 ఏళ్ల ప్రస్థానంపై పుస్తకం ఆవిష్కరణ





**గణపురం ఫిబ్రవరి16 ప్రజాజ్యోతి** కోటగుళ్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ఆదివారం రాత్రి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు కోటగుళ్లను సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోట గుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను సాదరంగా ఆహ్వానించారు. స్వామివారికి పూజలు నిర్వహించిన అనంతరం శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గంగాధర్ నాగరాజులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో జాగరణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కోట గుళ్ల 20 ఏళ్ల ప్రస్థానంపై ఆలయ ధర్మ కర్త అట్లూరి వెంకటలక్ష్మి నరసింహా రావు పావన రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో తాళ్లపల్లి యాదగిరి గౌడ్ రచించిన పుస్తకాన్ని వేదికపై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కోటగుళ్ల అభివృద్ధికి రెండు కోట్లు కేటాయించామని రాబోయే రోజుల్లో ఆలయ అభివృద్ధికి మరో 50 కోట్లు మంజూరు చేసేలా ప్రతిపాదనలు పంపించామని అన్నారు. ఆలయ విశిష్టత నిర్వహణపై పుస్తకాన్ని ప్రచురించిన ఏవి ఎల్ ఎన్ రావు దంపతులను రచించిన సీనియర్ జర్నలిస్ట్ తాళ్లపల్లి యాదగిరి గౌడ్ లను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పోషకులు నిర్వాహకులు, డాక్టర్ కోడూరు నవీన్ కుమార్, గణపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, కోటగుళ్లు పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, మాజీ ఎంపీపీ వడ్లకొండ నారాయణ గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి చోటె మియా, మాజీ సర్పంచ్ దూడపాక శంకర్, బోనాల రాజమౌళి,ఉపసర్పంచ్ ఓరుగంటి కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలు నీరటి భద్రమ్మకు నివాళి



**పర్వతగిరి, ఫిబ్రవరి 16 (ప్రజాజ్యోతి ):**పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్వాల వీరస్వామి, నీరటి శ్యామ్ గార్ల తల్లి నీరటి భద్రమ్మ అనారోగ్య కారణంతో మృతి చెందగా పర్వతగిరి సర్పంచ్ చీదురు శంకర్ పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతకుంట్ల అనిత రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు కుసం రామచందర్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ పిన్నింటి సునీల్ రావు, నరెడ్ల సూరయ్య, చీదురు మల్లేష్, ముక్కెర హరీష్, బక్క హరీష్, మట్ట రాజు, పిట్టల లోకేష్,మొగిలి యాకయ్య,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వాయిదా పడిన మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక నేడు నిర్వహణ

- ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో గోపిరామ్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 16 (ప్రజాజ్యోతి) :** జనగామ మున్సిపాలిటీకి సంబంధించి సోమవారం వాయిదా పడిన చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నికను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నేడు ( మంగళవారం) మధ్యాహ్నం 12:30గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఇట్టి కార్యక్రమానికి వార్డు సభ్యులందరితో పాటు, నమోదు చేసుకున్న ఎక్స్ ఆఫీషియో సభ్యులు కూడా తప్పకుండా హాజరు కావాలని ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో గోపీరామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## జర్నలిస్ట్ రాజు గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన బాదం ప్రవీణ్





**వెంకటాపూర్/ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):**ములుగు జిల్లా వెంకటాపూర్ మండలకేంద్రానికి చెందిన జర్నలిస్ట్ మునిగాల రాజు గౌడ్ తల్లి మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది.కాగా,ఈ విషయం తెలుసుకున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ సోమవారం వెంకటాపూర్ గ్రామానికి చేరుకొని మల్లమ్మ చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం జర్నలిస్ట్ రాజు గౌడ్ ను కలిసి పరామర్శించడంతోపాటు మల్లమ్మ మృతికి గల కారణాలను బాదం ప్రవీణ్ అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో బాదం ప్రవీణ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తడుక సుమన్ గౌడ్,సురేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ చైర్మన్ గా పావుశెట్టి సునీల్ కుమార్ అనే నేను

- వైస్ చైర్ పర్సన్ గా ఏకు దివ్య..
- మున్సిపల్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం..







**పరకాల, ఫిబ్రవరి 16,(ప్రజా జ్యోతి ):** పరకాల మున్సిపల్ కార్యాలయం లోని సమావేశపు హాలులో నూతనంగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్ ల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కౌన్సిలర్ ల చేత పరకాల ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం చేసిన కౌన్సిలర్ లను మున్సిపల్ కమిషనర్ అంజయ్య, అధికారులు, సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్ లకు ధ్రువపత్రాలను అధికారులు అందజేశారు. ముందుగా నూతన కౌన్సిలర్ ల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగగా అనంతరం పురపాలక ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ల ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ల ఎన్నికకు కౌన్సిలర్ల నుండి ప్రతిపాదనలు అధికారులు ఆహ్వానించారు. ముందుగా ఛైర్మన్ గా పావుశెట్టి సునీల్ కుమార్ ను కౌన్సిలర్ లు ప్రతిపాదించి బలపరిచారు. అదేవిధంగా వైస్ చైర్ పర్సన్ గా ఏకు దివ్య ను ఎన్నుకున్నారు. ఛైర్మన్ గా పావుశెట్టి సునీల్ కుమార్, వైస్ చైర్ పర్సన్ గా ఏకు దివ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పరకాల తహసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రవీందర్, టిపిఓ సుష్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గణపేశ్వరునికి ఘనంగా మహా అన్నపూజ

- స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీడీవో



**గణపురం ఫిబ్రవరి16ప్రజాజ్యోతి:** ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వ రాలయం కోటగుళ్ళ లో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం లింగోద్భవ రుద్రాభిషేకం అనంతరం సోమవారం పరకాల లలిత నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ రాజేశ్వరప్రసాద్ లలితా దేవి, డాక్టర్ కోడూరు నవీన్ కుమార్ సుమతి దంపతుల ఆధ్వర్యంలో మహ అన్న పూజ కార్యక్రమాన్ని పరిరక్షణ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం శివరాత్రి అనంతరం స్వామి వారికి మహ అన్న పూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఉదయం గణపతి పూజ అనంతరం అర్చకులు గంగాధర్ నాగరాజు, వినయ్,లు మొదట రుద్రాభిషేకం అనంతరం మహ అన్న పూజ కార్యక్రమం నిర్వహించారు. మహా అన్నపూజ సందర్భంగా గణపురం ఎంపీడీవో లంకపెల్లి భాస్కర్, పంచాయతీ కార్యదర్శి ఉమ్మల్ల విజేందర్ లు స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం అర్చకులు నాగరాజు భక్తులకు ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలు అందజేశారు.